క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్



అందంగా ముస్తాబు అయిన కళాశాల

ఆదోని టౌన్: ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అందంగా రూపుదిద్దుకుంది. త్వరలోనే ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవతో విరుపాపురం–సాదాపురం మధ్యలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో పాలిటెక్నిక్ కళాశాల కళాశాల భవన నిర్మాణం చేపట్టారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని అందంగా నిర్మించారు. త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2009లో ఆదోని పట్టణంలో కళాశాలను ఏర్పాటు చేశారు. ఆధునిక వసతులతో సొంత భవనం నిర్మించడంతో అధ్యాపకులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న విచారణ

ఆదోని అర్బన్ : ఐపీఎల్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని త్రీటౌన్ పోలీసులు ఈనెల 18న కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. నలుగురిని పోలీసులు చేసిన విచారణలో స్థానిక టిలికం నగర్‌కు చెందిన ఓ వ్యక్తి పేరు బయటకు వచ్చినట్లు సమాచారం. బెట్టింగ్ వ్యవహారంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల లావాదేవీలపై బ్యాంకు ఖాతాను పరిశీలిస్తున్నారు. ఎవరెవరు ఆడుతున్నారు, ఆట వెనక ఎవరున్నారు, ఏ స్థాయిలో ఉన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారా అనే విషయాలపై డీయస్పీ శివనారాయణస్వామి, సీఐ నరసింహరాజు,ఎస్ఐ పీరయ్య లోతుగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

నేటి నుంచి మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లు

కోసిగి: మండల కేంద్రం కోసిగి మోడల్ స్కూల్‌లో 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి జూన్ 7 వరకు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల ఉన్నాయన్నారు. విద్యార్థులు పదవ తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలు, రూ.150, ఓసీ,బీసీ విద్యార్థులు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రాజగోపురానికి రూ. 50వేలు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం ఓ భక్తుడు రూ.50 వేలను విరాళంగా అందజేశారు. గుంతకల్‌కు చెందిన కడియాల రంగస్వామి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్‌లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న బైక్

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామ సమీపంలో ఆదివారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇందిరానగర్‌కు యవకుడు సాగర్‌కు గాయాలవ్వగా వెనుక కూర్చున్న యువకుడు ఈశ్వర్ సురక్షితంగా బయటపడ్డాడు. వారిని ఆర్టీసీ డ్రైవర్ ఈరన్న స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ మేరకు డ్రైవర్ ఈరన్న మాట్లాడుతూ సిరుగుప్ప నుంచి ఆదోనికి వస్తుండగా పెద్దహరివాణం సమీపంలో ప్యాసింజర్లు దిగేందుకు బస్సును ఆపామన్నారు. అయితే ఓ శుభకార్యానికి హాజరై యువకులు బైక్‌పైవస్తూ బస్సును ఢీకొట్టారన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు



ఐరన్‌గల్లులో వీధిలైట్లు వేయిస్తున్న సర్పంచ్ రామాంజినేయులు

కోసిగి: మండల పరిధిలోని ఐరన్‌గల్లు గ్రామంలో సర్పంచ్ రామాంజినేయులు పంచాయతీ నిధులతో 10 ఎల్‌ఈడీ వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. కాలనీలలో సర్పంచ్ పర్యటించి వెలుగని వీధిలైట్ల స్థానంలో కొత్తవి దగ్గర ఉండి వేయించారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

పల్లెలు ప్రగతి‘బాట’

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంతో సమస్యలకు చెక్
- తీరుతున్న ఏళ్లతరబడి నెలకొన్న రహదారి ఇబ్బందులు
- సిమెంటు రోడ్ల ఏర్పాటుతో గ్రామాలు కళకళ
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



సుళేకేరిలో వంకలాంటి డ్రైనేజీ (ఫైల్)



సీసీ రోడ్డు కల్వర్టు తర్వాత రోడ్డు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తుంది. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ప్రభుత్వం గ్రామాల్లో సచివాలయ, ఆర్బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు తీసుకొచ్చి కొత్త భవనాలు నిర్మించడంతో పల్లెలు ప్రగతిబాట పట్టాయి. పల్లెల్లో పట్టణ శోభ నెలకొంది. ఇంకా మెరుగైన సేవలందించాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం సైతం సత్ఫలితాలిస్తుంది. గతంలో ఎవ్వరూ చేయని విధంగా ఎమ్మెల్యేతోపాటు, అధికారులు, ప్రజాప్రతిధులు ఇంటింటికీ వెళ్లి నేరుగా ప్రజలతో మమేకమవుతున్న తీరుపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుంటూ అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కార చర్యలు చేపడుతున్నారు ప్రజాప్రతినిధులు. అర్హత ఉండికూడా సంక్షేమ పథకాలు అందని వ్యక్తుల ఫిర్యాదు మేరకు అక్కడికక్కడే బాధితుడి సమక్షంలో అధికారులతో చర్చించి న్యాయం చేస్తున్నారు కూడా. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో సమస్య తీవ్రత... ప్రాధాన్యత మేరకు పరిష్కార చర్యలు చేపడుతున్నారు అధికారులు, ప్రజాప్రతినిధులు. గడప గడప కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం అవుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రాలయం మండలంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ అమరేష, జెడ్పీటీసీ రాధాప్రియదర్శిని, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రిగౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమ రాజు, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి తదితర నాయకులు అధికారులతో కలిసి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇప్పటికే మండంలో మూడొంతుల గ్రామాల్లో ‘గడప గడప’ కార్యక్రమాన్ని పూర్తి చేశారు ప్రజాప్రతినిధులు. ప్రత్యేకించి సీసీ రోడ్లు, డ్రైనేజీ, పొలాల రస్తాల సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవించారు. వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం చూపిన అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత మేరకు పరిష్కార చర్యలు చేపట్టడడంతో ఆయా గ్రామాల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

ఏళ్లతరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో అత్యధికంగా రోడ్ల సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ. 20లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ప్రజలకు విన్నవించిన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపారు. పొదలకుంటలో, మదిర, బంటకుంటలోగ్రామాల్లో సిమెంటు రోడ్లు పూర్తయ్యాయి. ప్రత్యేకించి సుళేకేరి గ్రామంలో కల్వర్టు లేనందున దాదాపు యాభై ఏళ్ల నుంచి పడుతున్న ఇబ్బందులు తొలగాయి. బందమవ్వ గుడి వద్ద నుంచి పై కాలనీలోకి పోవలంటే పెద్దవంక లాంటి డ్రైనేజీని దాటి వెళ్లాల్సి ఉంది. అయితే గడప గడపకు కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు కావడంతో ఈ పనులు పూర్తి అయ్యాయి. కల్వర్టు నిర్మించి రోడ్డు బాగు చేయడంతో సుళేకేరి ప్రజల సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి. అదేవిధంగా తోవి గ్రామంలో రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. సిమెంటు రోడ్లు వేయనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ నర్సమ్మ తెలిపారు. గుడికంబాలి, చిరుతపల్లి, మరళి గ్రామాల్లోనూ త్వరలో సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తీరిన రహదారి సమస్య....

అగసలదిన్నె గ్రామం నుంచి సుళేకేరి రస్తాలో ఉన్న పొలాలకు పోవడానికి చాలా కష్టం ఉందని రైతులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి విన్నవించారు. నాలుగు కిలోమీటర్లల దూరంలో ఉన్న సుళేకేరి గ్రామ సమీపానున్న పొలాలకు వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని మొరపెట్టుకున్నారు. ఎరువులు, దిగుబడులు తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. పొలాల రహదారిని ఏర్పాటు చేస్తే తొమ్మిది వందల ఎకారాలకు సంబంధించిన రైతుల పొలాలతోపాటు సుళేకేరి, హాల్వి గ్రామాలకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందని తెలుపడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంటనే మండల పరిషత్ ఫండ్ రూ.15లక్షలు మంజూరు చేయించడంతో రస్తా ఏర్పాటు పూర్తయ్యింది. ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్య తీరడంతో ఆయా గ్రామాల రైతులతోపాటు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యాభైఏళ్ల కల నెరవేరింది



మా గ్రామంలో పెద్ద వంకలాంటి డ్రైనేజీతో పైకాలనీకి, పొలాలకు, లింగాలదిన్నె గ్రామానికి వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. గతంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి చెప్పిన వెంటనే స్పందించారు. కల్వర్టు నిర్మాణంతో డ్రైనేజీ కాల్వల నిర్మాణం పూర్తయ్యింది. దాదాపు యాభై ఏళ్ల సమస్య పరిష్కారం అయ్యింది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– లక్ష్మన్న, సుళేకేరి గ్రామం

అభివృద్ధి సంతోషకరం



మా గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా ఎనిమిది రోడ్లకు సంబంధించి డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నారు. సిమెంటు రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయి. ఇలా గ్రామంలో అభవృద్ధి ఎప్పుడు చూడలేదు. చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సాయం మరువం. అధికారులకు కృతజ్ఞతలు. – చిన్న ఎల్లప్ప–తోవి గ్రామం



తోవిలోని బీసీ కాలనీ రోడ్డు (ఫైల్)



తోవిలో డ్రైనేజిల తర్వాత రోడ్డు పరిస్థితి



అగసలదిన్నె నుంచి సుళేకేరి వెళ్లే ఆయకట్టు రోడ్డ ,



అగసలదిన్నె నుంచి సుళేకేరి వెళ్లే ఆయకట్టు రోడ్డు

చదువుతోపాటు వ్యాయామం తప్పనిసరి



తస్లీమాకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : చదువుతో పాటు చిన్నారులకు వ్యాయామం తప్పనిసరిగా చేయాలని కేఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నటరాజ్‌స్వామి, వ్యాపారవేత్త అప్సర్‌బాషా తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కళాభారత్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ పొందుతున్న చిన్నారులకు క్రీడా సామగ్రి అందజేశారు. అంతకుముందు విద్యార్థి తస్లీమా యోగా, కరాటే తదితర ఆసనాల ప్రదర్శించారు. చిన్నారి చూపిన ప్రతిభను మెచ్చుకున్న దాతలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దేశాయి ఫౌండేషన్ పవన్, భార్గవ్ దేశాయ్, కేఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నటరాజ్ స్వామి, ప్రముఖ వ్యాపారవేత్త, మైనార్టీ నాయకులు అప్సర్‌బాషా, రిటైర్డ్ టీచర్ దేవప్రసాద్, అల్లుఅర్జున్, పట్టణాధ్యక్షులు చంద్రరాయల్, శిక్షకులు కేశవ మాస్టర్, కుమార్‌గౌడ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

ఆదోని రూరల్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి వేడుకలను ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, యూత్ కాంగ్రెస్ నాయకులు వీరేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఇర్ఫాన్, నిస్సార్‌అహ్మద్, మద్దిలేటి, మాణిక్, రాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో...

ఆదోని అర్బన్ : దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఆదోని మైనార్టీ కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదోని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, కర్నూలు జిల్లా మైనార్టీ చైర్మన్ ఎండీ నూర్ రాజీవ్‌గాంధీ సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు బి.తాయన్న, ఐఎన్‌టీసీ జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్, ఆదోని మైనార్టీ ఉపాధ్యక్షులు హుసేన్‌బాషా, మండలాధ్యక్షుడు హనుమంతు, మండల ఉపాధ్యక్షులు కుప్పగల్ అయ్యప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్తుకు బాట

కర్నూలు కల్చరల్: యువత ఉన్నత లక్ష్యాలు కలిగి భవిష్యతుకు బాటలు వేసుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజారామ్ కొల్లే అన్నారు. తిరుపతి పినాక సొసైటీ, పీపుల్స్ ఎంపవర్‌మెంట్, హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమిషనర్ బి.యాదగిరి ఐఆర్ఎస్, అమీలియో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ చాపె ఆధ్వర్యంలో రెవెన్యూ కాలనీలోని రవీంద్ర పాఠశాలలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, జేకే, గ్రూప్, సివిల్స్ ప్రిపరేషన్ గైడెన్స్‌కు సంబంధించిన ఉచిత శిక్షణ తరగతులకు ఆయన ఆదివారం హాజరయ్యారు. వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. యువత చదువుతో పాటు సంస్కారం, పట్టుదల, క్రమశిక్షణ కలిగి నిర్దేశించుకున్న లక్ష్యం కోసం నిరంతరం కష్టపడితే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.రవికుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్, మాదాసి మాదారి కురువ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సుంకన్న, ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బలరాం, ఎర్రకోట మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలాలను శ్మశానంతో పోల్చడం హేయం

- చంద్రబాబు తీరును ఖండిస్తూ ఆదోనిలో నిరసన



నిరసన ర్యాలీ పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆదోని టౌన్ : పేదల ఇంటి స్థలాలను సమాధులుగా పోల్చిన చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ ఆదివారం ఆదోనిలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నిరసన చేపట్టారు. ఎస్కేడీ కాలనీలో వైఎస్సార్సీపీ కార్యాలయం నుంచి కార్యకర్తలు, నాయకులు మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీగా భీమాస్ సర్కిల్‌కు చేరుకున్నారు. బాబుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబునాయుడు పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్క ఇంటి స్థలం రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలు చేసే పట్టాలను పంపిణీ చేశారన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నాలుగేళ్లలో 10,100 మందికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేశారన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చడం చూస్తుంటే చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల పట్ల ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు. ప్రజా సంక్షేమం పట్టని చంద్రబాబుకు వయసు మీద పడి అయోమయ స్థితిలో ఉన్నాడని విమర్శించారు. ఎన్ని కుట్రలు పన్నినా 2024లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా నాయకురాళ్లు శ్రీలక్ష్మి, సుగుణ, శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు దేవా, నాయకులు యల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అయ్యప్ప, దేవదాస్, యేసేబు, సిద్ధమల్లికార్జున, అమాన్, తిక్కన్న, ఈరప్ప, గంగాధర్, శీను, కౌన్సిలర్ చలపతి, ఎస్సీ సెల్ నాయకులు చిన్నలాలు, వశీం, చిన్నఈరన్న తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఆర్థిక సాయం

ఆదోని సెంట్రల్ : మంత్రాలయం ఎస్‌బీఐ బ్రాంచిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహబూబ్‌బాషాకు ఆపరేషన్ నిమిత్తం రూ.22,500 ఆర్థిక సాయం అందజేసినట్లు రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు జయనరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు ఓబులేష్, యూనియన్ నాయకులు రవీంద్రనాయక్, మధు, మహేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ మహబూబ్‌బాషా ఆరోగ్యం సరిగాలేదని యూనియన్ దృష్టికి తీసుకురావడంతో యూనియన్ సభ్యులందరం కలిసి ఆర్థిక సాయం చేశామన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎందే



గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సీతారామిరెడ్డి

మంత్రాలయం: పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నేత సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మిగనూరు రహదారిలోని జగనన్న కాలనీల్లో సువర్ణ, రాఘవేంద్ర దంపతులు నూతనంగా నిర్మించిన ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పూజ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వై.సీతారామిరెడ్డికి పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జఠిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ డివిజన్ కార్యాలయం ప్రారంభం



విట్టా రమేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆదోని రూరల్ : ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అధ్యక్షతన నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విట్టా రమేష్ మాట్లాడుతూ బీసీ ఐక్యమత్యంతో ముందుకు అడుగులు వేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ బీసీ కుల సంఘాల నాయకులు ఐక్యమత్యంతో రాజకీయంగా ఎదగాలన్నారు. అనంతరం విట్టా రమేష్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు మాన్వి దేవేంద్రప్ప, గౌరవ సలహాదారులు ధణాపురం శేషన్న, దేవిశెట్టి ప్రకాష్, తాలూకా అధ్యక్షుడు మరియాని చెన్నబసప్ప, జనరల్ సెక్రటరీ రమేష్ ఆచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.షేక్షావలి, గౌరవ సలహాదారులు బండ రాజేశ్వరరావు, కపటి వీరభద్ర, పట్టణ ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనివాసులు, రాముడు, శ్రీనివాసులు, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగ

- మండుతున్న ఎండలు
- ఉదయం 9 గంటల నుంచే సెగలు కక్కుతున్న సూరీడు
- బయటకు రావడానికి జంకుతున్న జనం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు

ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	తేదీ	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
16	38	19	42
17	39	20	43
18	41	21	42

గోనెగండ్ల: భానుడి సెగలకు జనం విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడిమి మొదలవుతుండటంతో బయటకు రావడానికి జంకుతున్నారు. 11 గంటల తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. తప్పనిసరి పరిస్థితిలో ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తువాలు లేదా గొడుగు లేదా టోపీ ధరించాలని, నీళ్ల బాటిల్ వెంట ఉంచుకోవాలని, వీలైనంత వరకు ఎండలో తిరగకుండా పని పూర్తి చేసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఇక వేడి గాలులకు వడదెబ్బ బారిన పడకుండా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీటిని ఎక్కువగా తీసుకోవాలి
- నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తినాలి
- పండ్ల రసాల కన్నా, పండ్లను తింటే ఎక్కువ లాభం ఉంటుంది
- తేలిక పాటి, నూలు, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులు ధరించాలి
- సాధ్యమైనంత వరకు ప్రయాణాలు మానుకోవడం ఉత్తమం
- అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



నిర్మానుష్యంగా ఎమ్మిగనూరు-కర్నూలు రోడ్డు


- ఎండలో వెళ్లేటప్పుడు గొడుగు/ టోపీ ధరించాలి.

మధ్యాహ్నం ప్రయాణాలు తగ్గించుకోవాలి..

వేసవిలో వీలైనంత వరకు ప్రయాణాలు తగ్గించుకోవడం మేలు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువ. తప్పనిసరైతేనే ప్రయాణాలు చేయాలి.

అప్పుడు కూడా హెల్మెట్‌గాని, క్యాప్‌గానీ ధరించాలి. వీలైనంత వరకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తరువాత ప్రయాణం చేస్తే మంచిది.

అప్రమత్తంగా ఉండాలి



ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రయాణాలకు దూరంగా ఉండాలి. చల్లని పానీయాలు తరచూ తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. వడదెబ్బ తగిలిన వెంటనే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తీసుకోవచ్చు. ఫ్రిడ్జ్ నీటి కంటే కుండలోని నీరు శ్రేష్టమైనవి.

– డాక్టర్. రజిని, గోనెగండ్ల, పీహెచ్‌సీ